చెప్పలేనన్ని ప్రమాదాలు.. రోడ్డు పాలవుతున్న కుటుంబాలు !


నడి రోడ్డులో ఏర్పడిన భారీ గుంత


అధ్వానంగా ఉన్న కొండపి-అనకర్లపూడి రోడ్డు

- మృత్యు రహదారిగా కొండపి-అనకర్లపూడి మార్గం
- నెలల వ్యవధిలో పలువురు మృతి
- వీధిన పడుతున్న మృతుల కుటుంబాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, అధికారులు

కొండపి:

ఆ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. కొండపి నుంచి అనకర్లపూడి మీదగా సంతనూతలపాడు, ఒంగోలు, చీమకుర్తి, మద్దిచెట్లపాలెం వెళ్లడానికి అనుకూలమైన రహదారి. ఇదే దారిలో అనునిత్యం లారీలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు తిరుగుతూనే ఉంటాయి. అనేక మంది అధికారులు కూడా ఇదే మార్గంలో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో నాలుగు కిలోమీటర్లకు అరగంట సమయం పడుతుందంటే రహదారి ఏ విధంగా ఉందో ఒకసారి అర్థం చేసుకోవచ్చు.

అధ్వానంగా రహదారి..

కొండపిలోని సాయిబాబా గుడి నుంచి అనకర్లపూడి ఎస్సీ కాలనీ వరకు అడుగడుగుకో గుంత ఉంది. రోడ్డు మార్జిన్లు పూర్తిగా ధ్వంసం అవ్వడంతో ఎదురు వాహనం వస్తే మార్జిన్ దిగడానికి వాహనదారులు తీవ్రభయాందోళనలకు గురవుతున్నారు. రోడ్డు మార్జిన్‌కు గుంతలలో పొలం మట్టి వేయడంతో వర్షానికి మట్టి జారడంతో అనేకమంది ద్విచక్ర వాహనదారులు పడిన ఘటనలు ఉన్నాయి. నాలుగు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట సమయం పడుతోంది. చీమకుర్తి నుంచి టంగుటూరుకు గ్రానైట్ లారీలు ఓవర్ లోడ్ గ్రావెల్ వాహనాలు సంతనూతలపాడు, మూగచింతల, మద్దులూరు ప్రాంతాల మీదుగా అనకర్లపూడి నుంచి కొండపివైపుగా టంగుటూరుకు వెళ్తున్నాయి. చీమకుర్తి నుంచి ఒంగోలు మీదుగా టంగుటూరి వెళ్లాలంటే ఆర్టీవో అధికారుల భయం టోల్ ఫీజు చెల్లించాలి అనే కారణాలతో కొండపి మీదుగా వాహనాలను టంగుటూరు హైవేకి తీసుకొని వెళుతున్నారు. వాహనం ఏ రహదారి నుంచి వచ్చినా అనకర్లపూడి నుంచి కొండపికి రావాల్సి ఉంటుంది. అధికలోడు వాహనాలతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

నెలల వ్యవధిలో పలువురు మృతి.

☛ 21వ జనవరి జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామం దైవదర్శనం అనంతరం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై చిరంజీవి, దుర్గారావు, అమిన్ అనే ముగ్గురు వ్యక్తులు బయలుదేరారు. కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో జేఎల్ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో కర్రల ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు మత్యువాత పడ్డారు.

☛ 1 సెప్టెంబర్ ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో రోడ్డు మార్గం దిగడంతో అదే రహదారిలో శాంతినికేతన్ హై స్కూల్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు చేసుకోలేక అదుపుతప్పి మద్దిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన వేజెండ్ల గంగాధర్ మరణించాడు.

కుటుంబాలకు తీరని శోకం..


శాంతినికేతన్ హై స్కూల్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బంధువులు నిత్యం వారిని తలుచుకుంటూ బాధపడుతూనే ఉన్నారు. ముండ్లమూరు మండలం శంకరాపురానికి గ్రామానికి చెందిన చిరంజీవి, దుర్గారావు, కుటుంబాలను పోషించేవారు కావడంతో వారు మరణించడంతో కుటుంబం చిన్నాభిన్నమైపోయింది. వేజెండ్ల గంగాధర్ చిన్న తనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పట్టుదలతో తెలివితేటలతో వ్యాపారం చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రమాదంలో మరణించడంతో కుటుంబ సభ్యులకు తీరని కడుపు మంటను మిగిల్చాడు. ఇప్పటికైనా మంత్రి స్వామి, అధికారులు స్పందించి ప్రమాదాలకు కారణమవుతున్న కొండపి, అనకర్లపూడి రోడ్డును నూతనంగా నిర్మించాలని కోరుతున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?



నాలుగు కిలోమీటర్ల ప్రయాణం నరకయాతనంగా ఉంది. నెలల వ్యవధిలో ముగ్గురు మత్యువాత పడినా అధికారులలో కొంచెం కూడా చలనం లేదు. 2025 సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు నిర్మిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదు.

– బచ్చల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

క్లుప్తంగా

స్థాయికి మించి వైద్యం చేస్తే సీజ్

కొండపి: ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే క్లినిక్‌లు సీజ్ చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వాణిశ్రీ అన్నారు. శుక్రవారం కొండపిలోని ఆర్‌ఎంపీ క్లినిక్ లను, ప్రైవేట్ వైద్యశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మర్రిపూడి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన మూలే రమణారెడ్డికి వైద్యం చేసిన క్లినిక్‌ను ఆమె సందర్శించి ఆర్‌ఎంపీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలు నిర్వహిస్తుండగా సిబ్బందిలో ఒకరు పక్కనే ఉన్న వేరొక ఆర్‌ఎంపికి విషయం తెలియజేయడంతో పేషంట్లను చూస్తున్న ఆ ఆర్‌ఎంపీ వెనువెంటనే బయటకు పంపి డోరు మూసివేసి వెళ్లిపోయాడు. తర్వాత పక్కనే ఉన్న ఆర్‌ఎంపి క్లినిక్ లోకి వెళ్లి ఆమె పరిశీలించగా కాలం చెల్లిన ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్ వాడకాన్ని గుర్తించారు. వాణిశ్రీ కొండపి రావడానికి గమనించిన మిగిలిన ఆర్‌ఎంపీలు పేషంట్లను బయటకు పంపించి వేసి తాళాలు మూసివేసి వెళ్లిపోయారు. తనిఖీలలో పెట్టలూరు పిహెచ్ సీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వీరేంద్ర, ఎంపిహెచ్‌ఓ మోహనరావు, పెట్లూరు ఆరోగ్య వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు హెక్టార్లు మాత్రమే నర్సరీ వేయాలి

కొండపి: ఒక రైతు గరిష్టంగా రెండు హెక్టార్లు మాత్రమే నర్సరీ వేయవలెనని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. వెన్నూరు గ్రామంలో కమర్షియల్ పొగాకు నర్సరీలను సాగు చేసే రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి పెట్టే ప్రతి రైతు బోర్డు వద్దకు వచ్చి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నారుమడులు పెట్టిన రైతులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక ఎకరానికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 200 అని తెలిపారు. కార్యక్రమంలో పాలెం టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మారెడ్డి రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

పామూరు: రోడ్డు ఆక్రమణలకు పాల్పడి ఎవరైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై టి.కిషోర్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన పామూరులోని సీఎస్‌పురంరోడ్డు, కనిగిరి రోడ్డులలో శుక్రవారం ట్రాఫిక్‌ను ఆయన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఇరువైపుల రోడ్డు మార్జిన్ల వరకు ఉన్న కాల్వల తరువాతే దుకాణాలు, బండ్లు ఉండాలన్నారు. వాహనాలతో, దుకాణందారులతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నంకాకుండా చూడాలన్నారు. అనంతరం 565 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీచేశారు. నిషేదిత వస్తువులను వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి కుర్చీల వితరణ

పీసీపల్లి: మండల పరిధిలోని పెద అలవలపాడు అంగన్వాడీ కేంద్రానికి దాత మాదాసు రమేష్ శుక్రవారం 10 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జరీనా మాట్లాడుతూ దాతల సాయంతో ప్రతి కేంద్రాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో పువ్వాడ నాగరాజు, ఆంజనేయులు సిబ్బంది ఉన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా హన్నమ్మ



కొండపి(టంగుటూరు): బీసీ బాలుర స్కూల్ ప్రిన్సిపాల్‌గా గుడిమెట్ల హన్నమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈమె తిరుపతి జిల్లా కోట మండలంలో బీసీ బాయ్స్ గురుకులలో పీజీటీ ఇంగ్లిష్ టీచర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సాధారణ బదిలీలో భాగంగా హన్నమ్మకు కొండపిలో బీసీ బాయ్స్ స్కూల్ రెగ్యులర్ ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు.

శనగలు రూ. 10 వేలకు కొనుగోలు చేయాలి



టంగుటూరు: శనగలు క్వింటా 10 వేలలకు కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో టంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శనగలను ఇతర దేశాలు నుంచి దిగుమతి చేసుకొని మన రైతుల వద్ద శనగలు కొనకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే రైతుల వద్ద రెండు సంవత్సరాల నుంచి నిల్వ ఉన్న శనగలను క్వింటకు రూ.10 వేల ధర ఇచ్చి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కారం చేయకపోతే వచ్చే నెల 6వ తేదీ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కె. వీరారెడ్డి, పి. కోటేశ్వరరావు, టీ.రాము, వి. మోజెస్, టీ. ప్రభాకర్, వి. సింగయ్య, ఎస్కె. మీరాస్, ఎమ్. కాలేషా బేగ్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో జగన్‌ను దుర్భాషలాడడం సిగ్గుచేటు


సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ కోటేశ్వరరావు

కొండపి: అసెంబ్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై దుర్భాషలాడటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. తన స్థాయి మరిచి ఎమ్మెల్యే బాలకృష్ణ హుందాగా వ్యవహరించకుండా ఇలా చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. శాసనసభ సమావేశంలో ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలి కానీ సభలో లేని వ్యక్తి గురించి ఇలా మాట్లాడటం తగదన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. మండల కన్వీనర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో మీ ఇంట్లో కాల్పులు జరిగితే ఎటువంటి కేసులు లేకుండా నిన్ను రక్షించింది వైఎస్సార్ అన్న విషయాన్ని మరిచిపోయావా అని ఎద్దేవా చేశారు. ఆ విషయాన్ని వైఎస్సార్ రాజకీయాల్లో ఎక్కడా వాడుకోలేదని టీడీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ కి సంబంధించిన ఆరోగ్యశ్రీ బిల్లులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే అని గుర్తు చేశారు. బాలకృష్ణకు కొంచమైనా సంస్కారం ఉంటే జగన్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని మడిపడ్డారు. కార్యక్రమంలో మాజీ జెసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైస్ ఎంపీపీ వేముల ప్రసాద్, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వన్నూరు, కోర్నెలు, సుల్తాన్, రమణారెడ్డి, చిన్నబ్బి, శేఖర్ రెడ్డి, సుబ్బారావు, నజీర్, చింతల వెంకటేశ్వర్లు, నారాయణ, పిచ్చయ్య, శ్రీనివాసరెడ్డి, శ్రీను, చిన్నవసంత్ రావు, వెంకటరావు, శివరాం, పార్టీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నను తిడుతున్నా పట్టించుకోని పవన్ కళ్యాణ్..


విలేకరుల సమావేశంలో పాల్గొన్న సింగరాయకొండ నాయకులు

సింగరాయకొండ: అసెంబ్లీలో సంక్షేమ సారధి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని వైఎస్సార్ సీపీ మండల పార్టీ తీవ్రంగా ఖండించింది. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మతిస్థిమితం లేదని డాక్టర్ సర్టిఫికెట్ ఉన్న వ్యక్తి బాలకృష్ణ అని విమర్శించారు. తన అన్నను బాలకృష్ణ తిడుతుంటే చేతగాని వ్యక్తిలా డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ ఉన్నాడన్నారు. గతంలో చిరంజీవిని అవమానించారని పెద్దఎత్తున పెడబొబ్బలు పెట్టిన పవన్ కళ్యాణ్ ఇప్పుడుమ ఏమైపోయాడన్నారు. చిరంజీవిని అన్ని మాటలన్నా పట్టించుకోకపోవడంపై కాపు నాయకులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ముఖ్యంగా బాలకృష్ణకు జగనన్న ఎంతో గౌరవం ఇచ్చాడని వైఎస్సార్ కూడా బాలకృష్ణ జైలుకు పోకుండా రక్షించాడన్నారు. ఎన్టీఆర్ కుటుంబానికి జగన్ ఎంతో గౌరవం ఇచ్చారని అటువంటి మంచి మనసున్న జగనన్నపై అసెంబ్లీ సాక్షిగా ప్రేలాపనలు మాట్లాడటం అతని నైతికంగా దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇటువంటి వ్యక్తిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని, జగనన్నకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు చొప్పర వెంకన్న, షేక్ మహమ్మద్‌బాషా, రాపూరి ప్రభావతి, సుదర్శి వెంకట్రావు, యనమల మాధవి, గొల్లపోతు గోవర్ధన్, పాకనాటి రమణారెడ్డి, కోమిట్ల వెంకారెడ్డి, షేక్ కరీం, షేక్ అబ్దుల్లా, మాదాల శంకర్, సయ్యద్ ఆబిద్ ఆలీ, నరేష్, మిరియం సుధాకర్, పురిణి దేవ, చొప్పర శివ, సాయి కోటి, షేక్ అల్లాఉద్దీన్, షేక్ నౌషాద్ పాల్గొన్నారు.

గ్రామ సింహాల తరలింపు..

సాక్షి ఎఫెక్ట్..


జల్లెడ సహాయంతో కుక్కలను పట్టుకుంటున్న పంచాయతీ సిబ్బంది

కొండపి: కుక్కల నుంచి కొండపి పంచాయతీకి పంచాయతీ అధికారులు కొంత విముక్తి కలిగించారు. కొండపి టౌన్‌లో ఏ వీధిలో చూచిన దాదాపు 10 కుక్కల వరకు తిరుగుతూ గట్టిగా అరుస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. స్థానిక పాత సచివాలయం సమీపంలో ఒక బాలుడిని దాడి చేసి గాయపరిచాయి. ఈ విషయాన్ని గమనించిన సాక్షి సోమవారం భౌభౌ భయపెడుతుంది. కుక్కలతో బెంబేలెత్తుతున్న కొండపి ప్రజలు అన్న శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు కుక్కలను పట్టుకునే వారిని పిలిపించి ప్రత్యేక జల్లెడతో కుక్కలు పట్టుకొని ప్రత్యేక వాహనంలో తరలించారు. మిగిలిన కుక్కలను కూడా త్వరలో పట్టుకొని విముక్తి కలిగించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

సజ్జ పంటను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకటేష్

మద్దిపూడి: ఇటీవల కురిసిన వర్షానికి మండలంలో సాగుచేపట్టిన సజ్జ పంట కన్ను మూసుకుపోయింది. అలాగే పంటకు పచ్చపురుగు ఆశించడంతో 'సజ్జ రైతుకు దిగుబడి దిగులు' అనే కథనం సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచరితమైంది. దీంతో స్థానిక వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ స్పందించారు. మండల కేంద్రమైన మద్దిపూడిలోని రైతు పల్లకి బసిరెడ్డి సాగుచేసిన సజ్జ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో 230 హెక్టారుల్లో సజ్జ సాగుచేశారని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కారణంగా కంకి దశలో ఉన్న సజ్జకు పచ్చపురుగు ఆశించిందన్నారు. దీని నివారణకు 80 గ్రాములు ఇమామెక్టిన్ లేదా ఫ్లూబెండమైడ్ 60 ఎంఎల్ పిచికారీ చేస్తే దిగుబడిపై ఎలాంటి ప్రభావం ఉండదని రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు పల్లకి నవీన్‌రెడ్డిలు ఉన్నారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర


వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్ కుమార్


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలో తీసుకోవాలన్నారు. పంటల మార్పిడి చేసుకోవాలని బోర్డ్ అనుమతించిన మేర పొగాకున సాగు చేయాలని సూచించారు. రైతులు తమ వద్దనున్న బేళ్ల వివరాలను తెలియజేయాలన్నారు. వేలానికి ఒక రోజు ముందు వచ్చి మార్కెట్ వివరాలను తెలుసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలో ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోటిపాలెం, తాటాకులపాలెం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 1307 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 1071 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 236 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 341, కనిష్ట ధర కేజీ రూ.90 సరాసరి ధర కేజీ రూ 257.76గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: పొగాకు బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని ఒంగోలు ప్రాంతీయ అధికారి రామారావు అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో, పొగాకు కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 142 మిలియన్ల కేజీలు ఉత్పత్తికి అనుమతించారు. రైతులు అధిక ధరలకు పొలం, బ్యార్నీల కౌలుకు తీసుకోవద్దని, పొగాకు బోర్డు సూచించిన ఒక్కో బ్యార్నీకి 3565 కేజీలు పండించాలన్నారు. స్థానిక వేలం కేంద్రానికి చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1059 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 907 కొనుగోలు జరగగా, 152 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 340 కాగా, కనిష్ట ధర రూ.100 పలకగా, సరాసరి రూ. 294.52 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గం

- నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్


దద్దాల నారాయణ

కనిగిరిరూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనుచిత వాఖ్యలు చేయడం అత్యంత దుర్మార్గం అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జగన్ గూర్చి సభలో బాలకృష్ణ చేసిన వాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాలకృష్ణకు లేదన్నారు. చిరంజీవి లేదా చంద్రబాబుతో విభేదాలు ఉంటే వాళ్లతోనే బాలకృష్ణ తేల్చుకోవాలని, అసెంబ్లీలో సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడం సరైంది కాదన్నారు. సభలో బాలకృష్ణ తీరు చూశాక తప్పనిసరిగా ఆయనకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాల్సిన పరిస్థితి కనిపస్తోందన్నారు. సొంతింటిలో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలుగు రాష్ట్ర ప్రజలందరికి తెలుసునన్నారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తగు భాషలోనే తాము కూడా బదులిస్తామన్నారు.

అష్టైశ్వర్యాలు ప్రసాదించే మహాలక్ష్మి


భైరవకోనలో మోహినీదేవి అలంకరణలో దుర్గాదేవి


సీఎస్‌పురంలో శ్రీలక్ష్మీదేవిగా రాచూరి పెద్దమ్మ అమ్మవారు


సీఎస్‌పురం: సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు

సాక్షినెట్‌వర్క్: దసర శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఐదో రోజు అమ్మవారు అష్టైశ్వర్యాలు ప్రసాదించే మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా చతుర్భుజాలతో ఒక హస్తం అభయముద్రతో, రెండు హస్తాలతో కమలాలతో, ఒకహస్తంతో కనకదార కురిపిస్తూ తనదివ్య మంగళస్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. లోకస్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన గజలక్ష్ములుగా, వరాలు ప్రసాదించే అష్టలక్ష్ములను దర్శించటం వల్ల ఐశ్వర్యప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.


సీఎస్‌పురం: ధనలక్ష్మీ అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

ఏళ్లనాటి నేరేడు చెట్టు నరికివేత


నేరేడు చెట్టును నరుకుతున్న దృశ్యం

టంగుటూరు: చెట్లు నాటండి.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అంటూ చిలుకపలుకులు పలికే కూటమి ప్రభుత్వంలో పర్యావరణం నాశనం అవుతోంది. ఈ ఘటన టంగుటూరు ఆర్టీసీ డిపో సమీపంలో శుక్రువారం చోటుచేసుకుంది. టంగుటూరు గ్రామానికి చెందిన బలగాని వెంకటేశ్వర్లు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఏళ్లనాటి నేరేడు చెట్టును అనుమతులు లేకుండా నరికివేశాడు. చెట్టును నరుకుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లుగా వ్యవహరించారు. ఆర్‌అండ్‌బీ కింద స్థాయి సిబ్బంది మాత్రం ముడుపులు అందాయని జోరుగా ప్రచారం సాగుతోంది.

బ్రహ్మయ్య, విష్ణుల మృతికి సంతాపం

కనిగిరిరూరల్: పోతవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రహ్మయ్య, విష్ణులు మృతి చెందడం పట్ల వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నియోజకవర్గంలోని హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాలకు చెందిన మచ్చ బ్రహ్మయ్య, బండ్లమూరి విష్ణులు కనిగిరికి వస్తూ పాదిలి మండలం పోతవరం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు మరణించడం పట్ల వారి కుటుంబ సభ్యులకు దద్దాల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ


ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన నాయకులు

కనిగిరిరూరల్: దద్దాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఎనిమిది మంది దివ్యాంగులకు సుమారు రూ.లక్ష విలువ చేసే ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈమేరకు పార్టీ నాయకుల చేతుల మీదుగా గురు, శుక్రవారాల్లో వాటిని అందచేశారు. కనిగిరి మండలంలోని రెండు, పీసీపల్లిలో రెండు, పామూరులో రెండు, సీఎస్‌పురంలో ఒకటి, వెలిగండ్లలో ఒకటి ట్రైసైకిళ్లలను దివ్యాంగులకు అందజేశారు. పేదవారికి తమ ట్రస్ట్ ద్వార ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందచేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.